బానుడి భగభగ.. బస్సులెక్కడ.?

కోటి జనాభాకు.. ఉన్నవి 2600 బస్సులే

- మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సుల కుదింపు
- రోడ్లపై ఎండలోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు
- గ్రేటర్ ఆర్టీసీ నిర్ణయంపై ప్రయాణికుల ఆగ్రహం
- బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికుల డిమాండ్
- పేరుకే ఫ్రీ బస్.. క్యాబ్‌లు, ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి

శుక్రవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎండలో వేచిచూస్తున్న ప్రయాణికులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో బస్సులు అందుబాటులో లేక బస్టాపుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. మండుతున్న ఎండల్లో సమయానికి బస్సులు రాక నానా యాతన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బస్సుల ట్రిప్పుల సంఖ్య పెంచి ప్రయాణికులను ఎండ నుంచి రక్షించాల్సింది పోయి.. అదే ఎండల కారణంగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సుల సంఖ్య కుదిస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్సుల సంఖ్య తగ్గింపు సరికాదు

నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాల కోసం చాలా మంది బస్సులపై ఆధారపడుతుంటారు. ఇది నిరంతర ప్రక్రియ. పలాన సమయంలో ప్రయాణాలు రద్దు చేసుకోండి అంటే జీవిత బండి నడిచే పరిస్థితి ఉండదు. కంపెనీల్లో షిఫ్టుల ప్రకారం పనులుంటాయి. ఉదయం ఉద్యోగాలకు వెళ్లిన వాళ్లు మధ్యాహ్నం పని ముగించుకుని ఇంటికి వస్తుంటారు. మరోవైపు ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రయాణికులు ఉదయం బయలుదేరితే మధ్యాహ్నం నగరానికి చేరుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో నగరంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బస్సుల సంఖ్య తగ్గిస్తే వారంతా తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. మండుతున్న ఎండల్లో బస్సులు లేక పిల్లలు, వృద్ధులతో వారంతా ఎలా గమ్యస్థానాలకు చేరుకోవాలో చెప్పాలని ప్రయాణికులు నిలదీస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి.. ఇప్పుడు వాటి సంఖ్య తగ్గించడం మోసం చేయడమేనని వాపోయారు.

అవసరం 7వేల బస్సులు.. ఉన్నది 2600 మాత్రమే

గ్రేటర్ జనాభా కోటి మించింది. ఈ పరిస్థితిలో వారి రాకపోకలకు నగరంలో కనీసం 7వేల బస్సులు సమకూర్చాల్సిన అవసరం ఉందని ఇప్పటికే రవాణా రంగ నిపుణులు నివేదికలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ బస్సుల సంఖ్య గ్రేటర్ జనాభాకు తగ్గట్టు పెంచలేదు. ఆర్టీసీ నష్టాల కారణంగా బస్సుల సంఖ్య పెంచలేకపోతున్నామంటూ అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌లో 2800 బస్సులు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో ప్రస్తుతం 2600 బస్సులు నడుస్తున్నాయి. 30వేల ట్రిప్పులు కొనసాగుతున్నాయి. ఇవి సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బస్సుల సంఖ్య కుదించడం ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు కల్గించడమేనని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ సమస్య నగరంలో జఠిలంగా మారింది. ఇప్పుడు ఆర్టీసీ బస్సుల ట్రిప్పులు తగ్గిస్తే సాయంత్రం 4 నుంచి ట్రాఫిక్ సమస్య మరింత పెరగనున్నదని అంటున్నారు.

మధ్యాహ్న సమయంలో బస్సులు పెంచాలి

నగరంలో మధ్యాహ్న సమయంలో బస్సులను తగ్గించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గంటల కొద్దీ వేచి చూసినా బస్సులు రావడం లేదు. చివరకు క్యాబ్‌లు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు.

– దేవిశెట్టి బాలాజీ, వివేకానందనగర్‌కాలనీ

బస్సులు యథావిధిగా నడపాలి

సరిఫడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నాం. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్టీసీ బస్సులను తగ్గించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలి. అసలే వేసవి కాలం ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. కనీసం ఉన్న బస్సులనైనా యథావిధిగా పునరుద్ధరించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలి.

–మెండ రఘు, ప్రయాణికుడు, ఉప్పల్.

సిటీలో బస్సుల సంఖ్యను పెంచాలి

నగర శివారు ప్రాంతమైన హయత్‌నగర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి నగరానికి వివిధ పనుల నిమిత్తం వేలాది సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల సంఖ్య సరిపోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మళ్లీ ఉన్న బస్సుల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుదించడం సరైన నిర్ణయం కాదు. గత ప్రభుత్వ హయాంలో పది నిమిషాలకు ఒకసారి బస్సులు నడుస్తుండేది.

– కట్ట వెంకటేశ్ ముదిరాజ్, హయత్‌నగర్.

వెయ్యేండ్లు నిలిచేలా.. బాచుపల్లిలో అడుగుపెట్టాం

- ఘనంగా తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం
- ప్రముఖ చిత్రకారులు సీవీ.అంబాజీకి విశిష్ట పురస్కార ప్రదానం
- ఆకట్టుకున్న జానపద, సంగీత, నృత్య ప్రదర్శనలు

ప్రముఖ చిత్రకారులు సీవీ.అంబాజీని సత్కరిస్తున్న తెలుగువిశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు తంగెడ కిషన్‌రావు, అతిథులు

దుండిగల్ / తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 19 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం బాచుపల్లిలోని యూనివర్సిటీ ప్రాంగణం విస్తరణ సేవా విభాగంలో ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా సాహిత్య, సాంస్కృతిక, లలిత కళా రంగాల నుంచి ప్రముఖులను ఎంపిక చేసి విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వారికి విశిష్ట పురస్కారం పేరిట సత్కరిస్తుంది. 2022 ఏడాదికి గాను ప్రముఖ చిత్రకారులు సీవీ.అంబాజీకి విశిష్ట పురస్కారం ప్రదానం చేయడంతో పాటు లక్ష రూపాయల నగదును అందజేసి సత్కరించారు. అంతకు ముందు సభాధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు(వైస్‌చాన్స్‌లర్) తంగెడ కిషన్ రావు మాట్లాడుతూ వెయ్యేండ్ల వరకు నిలిచే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం రూపొందాలని, వర్సిటీలోని శాఖలన్నింటికీ ప్రత్యేక భవనాలు నిర్మించే విధంగా రూపకల్పన జరగాలనే సంకల్పంతో బాచుపల్లి ప్రాంగణంలోకి అడుగుపెట్టామన్నారు. జానపదుడిగా ప్రాథమిక విద్యతోనే చదువును ముగించి, ప్రపంచస్థాయి చిత్రకారుడిగా ఎదిగిన అంబాజీకి విశిష్టపురస్కారం అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎస్‌వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సంస్కృతిని పరిరక్షిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి కృషి జరగాలని, కేవలం పురస్కారాలను అందించడమే కాకుండా దేశీ, జానపద, సాంప్రదాయ కళలను సమాజానికి అందించే దిశగా వర్సిటీ పనిచేయాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ ఉన్నతాధికారి, ప్రముఖ కవి, డా.ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తనకు తెలుగు యూనివర్సిటీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అంతకు ముందు విశ్వవిద్యాలయం లలిత కళాపీఠం ఆధ్వర్యంలో ప్రదర్శించిన జానపద, సంగీత, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా డప్పు కళాకారుల ప్రదర్శన, పేరిణీ నృత్యం విశేషంగా ఆకర్షించాయి. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేశ్ స్వాగతం పలుకగా, విస్తరణ సేవా విభాగం సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

కేర్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స

వివరాలు వెల్లడిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 19 : జన్యుసంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలుడికి బంజారాహిల్స్ రోడ్డు నం.1లోని కేర్ ఆస్పత్రి వైద్యులు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.మహ్మద్ నయూమ్ వివరాలను వెల్లడించారు. నగరానికి చెందిన అరుణ, రవి దంపతుల కుమారుడైన వరుణ్ మిత్ర(12) పుట్టుకతోనే అత్యంత అరుదైన జన్యుసంబంధిత అలగిల్లీ సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. సుమారు లక్షమందిలో ఒక్కరికి మాత్రమే ఉండే ఈ సిండ్రోమ్‌లో కాలేయంలోపల ఉండాల్సిన బైల్ డక్ట్, కెనాల్ సిస్టమ్ సరైన విధంగా అభివృద్ధి చెందదు. దీంతో కాలేయంతో పాటు రక్తంలో బైల్‌రూబిన్ పేరుకుపోవడంతో కామెర్లతో పాటు, తీవ్రమైన దురద తదితర సమస్యలు రావడంతో పాటు కాలేయం పనిచేయడం మానేస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న వరుణ్‌మిత్ర పరిస్థితి ఇటీవల మరింత క్షీణించడంతో పాటు ధమనిలో అడ్డంకులు ఏర్పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. జన్యుపరమైన లోపాలతో పాటు తక్కువ బరువు ఉండడంతో అత్యంత రిస్క్‌తో కూడుకున్న కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను ఇటీవల విజయవంతంగా పూర్తిచేశారు. తల్లి అరుణ నుంచి కాలేయాన్ని సేకరించిన వైద్యులు వరుణ్ మిత్రకు అమర్చగా అతడు పూర్తిస్థాయిలో కోలుకున్నాడని డా.మహ్మద్ నయూమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలుడితో పాటు తల్లిదండ్రులు, కేర్ ఆస్పత్రి సీవోవో సయీద్ కమ్రాన్, మెడికల్ సూపరింటెండెంట్ డా.అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించాల్సిందే

రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్. కృష్ణయ్య

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : బీసీలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించాల్సిందేనని బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలన్నీ బీసీలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పిస్తామని, బీసీ బిల్లు పెడతామని, బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 85 బీసీ కుల సంఘాలు, 36 బీసీ సంఘాలు, 18 బీసీ ఉద్యోగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అన్ని కుల సంఘాల నాయకులు బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామికబద్ధమైన విద్యా, ఉద్యోగ, ఆర్థిక వాటా ఇవ్వలేదన్నారు. అలాగే రాజకీయ, పారిశ్రామిక జనాభా ప్రకారం వాటా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, కోలా జనార్దన్, భరత్, మాజీ ఎంపీ అజీజ్ పాషా, లక్ష్మణ్ యాదవ్, కొండా దేవయ్య, గుజ్జ సత్యం, శ్రీనివాస యాదవ్‌తోపాటు యాదవ, మున్నూరు కాపు, ముదిరాజ్, పూసల, కురుమ, విశ్వబ్రాహ్మణ సంఘాలకు చెందిన నేతలు హాజరయ్యారు.

హెచ్‌సీయూలో భౌతిక దాడులను అరికట్టాలి

కొండాపూర్, ఏప్రిల్ 19 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భౌతిక దాడులను అరికట్టాలంటూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతిక్ హైమద్, ప్రధాన కార్యదర్శి కృప మాట్లాడుతూ యూనివర్సిటీలో కొంతమంది ఏబీవీపీ నాయకులు విద్యార్థుల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. గత కొంత కాలంగా అనేక ఎలక్షన్లలో ఏబీవీపీ ఓటమి పాలవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని, ఆ సంఘానికి సంబంధించిన కొంతమంది వ్యక్తులు విద్యార్థులపై దాడులు చేస్తూ, క్యాంపస్‌లో అలజడి సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల క్యాంపస్‌లో ఫెయిర్‌వెల్ పార్టీ కమిటీ మెంబర్లపై భౌతికదాడికి పాల్పడి గాయపరిచినట్లు తెలిపారు. ఇకనైనా యాజమాన్యం స్పందించి క్యాంపస్‌లో అలజడి సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ, డీఎస్‌యూ, టీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిగిలేవి గురుతులే 27న పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 27న కొత్తపేటలోని స్కైనీ హబ్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు 'చిత్రకళా తపస్వి డా.కొండపల్లి శేషగిరిరావుకి జీవన్ గాథా హిందీ అనువాద గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం జరగనున్నదని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా డాక్టర్ ఓలేటి పార్వతీశం, ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్.గోపి, ఆత్మీయ అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ధూళిపాళ అరుణ రచించిన 'మిగిలేవి గురుతులే' కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

కొనసాగుతున్న టెక్నోస్మానియా

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 19 : ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహిస్తున్న టెక్నోస్మానియా – 2024 వేడుకలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఐడియా ప్రజెంటేషన్, మోడల్ మేకింగ్, క్రాస్ వర్డ్, ట్రెజర్ హంట్, క్విజ్, శారీ స్వాగ్ తదితర పోటీలు జరిగాయి. 'ఇన్నోవేషన్స్ ఇన్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అండ్ న్యూట్రిషన్ ఆఫ్ ఫుడ్' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ బీవీఎస్ ప్రసాద్, 'ట్రెడ్స్ ఆఫ్ కంటిన్యుటీ ఎవాల్యుయేషన్ ఇన్ టెక్స్‌టైల్స్'అనే అంశంపై డాక్టర్ పుష్పలత క్యాతం అతిథి ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో అలరించారు. అనంతరం సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేశ్‌కుమార్, ప్రొఫెసర్లు బసవరావు, రాజం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.పరుశురాం, డాక్టర్ పరమేశ్వర్లు, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ వి. భాస్కర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనిత, స్టూడెంట్ కోఆర్డినేటర్లు రేగ శ్యాంసుందర్, మాధవి, ఆకాశ్, అఖిల, ముఖేశ్, సాహిత్య, సూరిదుర్గ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మలయశ్రీకి సాహిత్య పురస్కారం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 19 : తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత డాక్టర్ ఎం.శ్రీధర్ రెడ్డి పేరుతో తెలంగాణ సారస్వతి పరిషత్తులో నెలకొల్పిన సాహిత్య పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన శతాధిక గ్రంథకర్త డాక్టర్ మలయశ్రీ ఎంపికైనట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య శివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భైరవపురి ఆలయ శంకుస్థాపన

బీబీనగర్, ఏప్రిల్ 19 : మండలంలోని మగ్దూంపల్లి గ్రామంలో భైరవపురి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు సిద్దేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠం మాతాజీ రమ్యానంద భారతి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ స్వర్ణాకర్షణ భైరవ, మహాలక్ష్మి కుబేర, వారాహి, మాతంగి దేవతలతో మహా దివ్య క్షేత్రంగా ఆలయ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. పీఠం పురోహితులు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్, సెక్రటరి మునిపల్లె శ్రీనివాస్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాతాజీ అద్వైతానంద, గ్రామ సర్పంచ్ పిష్కు లక్ష్మీనారాయణ, ఆర్‌డీఓ అమరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెటిజన్లపై.. టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎదురుదాడి

కరెంట్ పోయింది.. కాదు.. మీ మెదడు చెడిపోయింది

- మీరు పేషంట్ అయితే దుబాయిలో ఏం జరుగుతుందో.. టీవీలో చూడు''
- కరెంట్ కోతలపై ఫిర్యాదు చేసిన నెటిజన్లపై.. టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారి ఎదురుదాడి
- ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు



సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : అసలే ఉక్కపోత, అందులో అర్ధరాత్రి పొద్దంతా కష్టపడి ఇంటికి వచ్చి ప్రశాంతంగా నిద్రపోదామనుకునే సమయంలో కరెంట్ కట్. ఇంకేముంది. అప్రకటిత కరెంట్ కోతలతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయం, సందర్భం లేకుండా అనధికారిక పవర్ కట్‌పై ఉడికిపోతున్నారు. ఇదే విషయాన్ని ఓ నెటిజన్ సోషల్ మీడియాలో పంచుకోగా దీనికి స్పందించాల్సిన పవర్ శాఖ అధికారులు కారణాలు చెప్పకుండా నెటిజన్లపై ఎదురుదాడి చేస్తున్నారు. ఒకటో, రెండో సమాధానాలు అంటే పొరపాటే.. @TSSPDCL Corporationను ట్యాగ్ చేసిన ప్రతి ఫిర్యాదుపై ఓ అధికారి అత్యుత్సాహం ప్రదర్శించి నెటిజన్లపై విరుచుకుపడ్డారు. ఓవైపు అప్రకటిత కోతలు ఏమిటనీ నెటిజన్లు ఫిర్యాదులు చేస్తుంటే సమాధానం చెప్పాల్సిన అధికారి తానొక టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారిగా బయోలో పేర్కొనగా, ఆ హోదాలో ఉండి ట్విట్టర్‌లో ఎదురుదాడి చేశారు. ప్రస్తుతం ఆయన ఇచ్చిన సమాధానాలు వైరల్ అవుతుంటే.. ఆయన తీరును ప్రశ్నిస్తూ నెటిజన్లు ఏకంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకే ఫిర్యాదు చేశారు.

మీ మెదడు చెడిపోయి.. విద్యుత్ లైన్లను డ్యామేజ్ చేస్తున్నాయి

''వర్షం లేదు, కనీసం గాలి దుమారం లేదు. అయినా విద్యుత్ సరఫరా లేదు. నా ఒక్క ఇంటి సమస్య కాదు. కానాజీగూడ శివనగర్‌లోని టెలికాం కాలనీ మొత్తం ఇదే సమస్య. ఇంకేప్పుడు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుంది'' అంటూ ఓ నెటిజన్ అసహనంతో టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు ఫిర్యాదు చేశాడు. దీనికి సమాధానంగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారి(@sivaji1979) అనే ఎక్స్ హ్యాండిల్ నుంచి స్పందిస్తూ... '' మీరు యూజర్ నంబర్ ఇవ్వకుండా ఫిర్యాదు చేస్తున్నారు అంటే.. మీరు ఫేక్ అకౌంట్ నుంచి ఫిర్యాదు చేస్తున్నట్లుగా లెక్క. మీ మెదడు చెడిపోయి విద్యుత్ లైన్లను డ్యామేజ్ చేస్తున్నాయి. ఒకవేళ మీరు పేషంట్ అయితే దుబాయిలో ఏం జరుగుతుందో... టీవీలో చూడు'' అంటూ సమాధానం ఇచ్చారు.

సరైన రీతిలో ఫిర్యాదు చేయాలి..!

బండ్లగూడ జాగీర్‌కు చెందిన తమ ప్రాంతంలో నెలకొన్న పవర్ కటింగ్ చేశారని ఫిర్యాదు చేయగా... ''మీరు సరైన రీతిలో ఫిర్యాదు చేయకుండా పొలిటికల్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. రేష్మా గారు ఫిర్యాదు చేసే ముందు నిజాలు తెలుసుకోండి'' అంటూ విరుచుకుపడ్డారు.

ఏ పార్టీలో ఉంటే నాకేంటీ..

ఇక తమ ప్రాంతంలో నెలకొన్న కరెంటు సమస్యలపై కార్తీక్ రెడ్డి ఫిర్యాదు చేయగా.. దీనికి సమాధానంగా మీరు ఏ పార్టీ కోసం పనిచేస్తున్నారో మాకు అనవసరం. కానీ ఆకాశం మీద ఉమ్మి వేసే ముందు ఒకసారి ఆలోచన చేయండి. మీ తీరు మొత్తం రాజకీయ ఉద్దేశంతోనే ఉంది. ఇదంతా చూస్తుంటే మీరు బీఆర్ఎస్ కోసం పనిస్తున్నారు అనుకుంటా.'' అంటూ వ్యాఖ్యానించారు. అయితే జవాబుదారీతనానికి నిదర్శనంగా ఉండాల్సిన టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారి చేసిన ట్వీట్లపై నెటిజన్లు కూడా అదే స్థాయిలో స్పందించారు. ఏకంగా స్థానికంగా ఎదుర్కొంటున్న అప్రకటిత కరెంట్ కోతలపై ఫిర్యాదు చేసినందుకు.. పొలిటికల్ చేస్తున్నారని భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లే అవుతుందని, ప్రజలు కట్టిన పన్నులతో జీతాలు తీసుకుంటున్న @sivaji1979పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మగ్దూంపల్లి గ్రామంలో భైరవపురి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్దేశ్వరానంద భారతి

న్యూడ్‌కాల్ చేశావంటూ.. రూ.30 వేలు వసూలు

సిటీబ్యూరో,ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ) : గుర్తు తెలియని ఓ మహిళ యువకుడికి న్యూడ్ వీడియోకాల్ చేసి బెదిరించి రూ.30వేలు వసూలు చేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కందుకూరు మండల కేంద్రంలో నివాసముంటున్న ఓ యువకుడికి గుర్తు తెలియని మహిళ ఈనెల 17న న్యూడ్ కాల్‌చేసి హిందీలో మాట్లాడుతుండగా సదరు కాల్‌ను కట్‌చేశాడు. 18న ఓ వ్యక్తి వీడియోకాల్ చేసి తాను పోలీసునని.. మహిళకు న్యూడ్ కాల్ చేస్తున్నావని బెదిరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో యువకుడు రూ.30 వేలు ఫోన్ పే చేశాడు. తిరిగి మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ మక్బూల్ జానీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీహెచ్ఈఎల్‌తో ఐఐసీటీ ఒప్పందం

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, బీహెచ్ఈఎల్ మధ్య కీలక ఒప్పందం జరిగింది. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని గ్రీన్ ఎనర్జీగా కన్వర్ట్ చేసే టెక్నాలజీని డెవలప్ చేయడంలో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. శుక్రవారం ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, బీహెచ్ఈఎల్ ప్రతినిధుల మధ్య ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు.

నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ

అమీర్‌పేట్, ఏప్రిల్ 19 : సనత్‌నగర్‌లోని నాట్య శిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వాసుకి శ్రీనివాస్ తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ఆవరణలోని శివాలయం హాల్‌లో ఈ నెల 25 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కూచిపూడి, ఆంధ్రనాట్యం, శివతాండవం, శాస్త్రీయ నృత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందని, ఈ ఉచిత శిక్షణకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9849355145, 8008824482, 80088 25651లలో సంప్రదించాలని సూచించారు.